


ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను ఢిల్లీ పర్యటనలో ఉన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ సోషల్ మీడియా ద్వారా సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అదనపుపరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమార్థం త్వరితగతిన పరీక్ష ఫలితాలు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాశ్‌రెడ్డి, నారపరెడ్డి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా పరవళ్లు



జిల్లాలో మేఘాలు ఊరిస్తున్నాయే కానీ చినుకులు కురిపించడం లేదు. అయితే.. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పెన్నా పరవళ్లు తొక్కుతోంది. సిద్ధవటం సమీపంలోని లోలెవల్ బ్రిడ్జి వద్ద పెన్నా ఉధృతిగా ప్రవహిస్తోంది. ఈ దారిన పోయే వారు బ్రిడ్జిపైన ఆగి ఫొటోలు తీసుకుంటూ సంబరపడుతున్నారు.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



హోరాహోరీ

సార్వత్రిక ఎన్నికల తరువాత జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 12న ఉప ఎన్నికలు జరగనున్నాయి. మాజీ సీఎం జగన్ సొంత గడ్డ అయిన ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఉప ఎన్నికలను వైసీపీ, టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో పులివెందులలో ఎంపీ అవినాశ్‌రెడ్డి అన్నీ తానై నడిపిస్తున్నారు. పులివెందులలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఇక ఒంటిమిట్ట బరిలో వైసీపీ నుంచి మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి ఉండగా టీడీపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.

- పులివెందులలో కాకరేపుతున్న జడ్పీటీసీ ఉప పోరు
- వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికల జోరు
- వైసీపీ బెదిరింపులు షురూ
- ఒంటిమిట్ట టీడీపీలో గ్రూపుల గోల
- అభ్యర్థి ఖరారు కాని వైనం
- నేడు నామినేషన్ల ఉపసంహరణ



(కడప-ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కావడంతో ఇక్కడ జరిగే ప్రతి ఎన్నికా ప్రాధాన్యం సంతరించుకుటుంది. జగన్ హయాంలో పులివెందుల నియోజకవర్గంలో స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయాలంటేనే సాధ్యంకాని పరిస్థితి. అప్పుడు పోలీసులు కూడా వైసీపీ వారికి పూర్తిగా సహకరించారు. ఇప్పుడు జరిగే ఉప ఎన్నికల్లో మాత్రం అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నామినేషన్ల ప్రక్రియ ముగిసి, ఉపసంహరణకు వచ్చింది. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి సతీమణి లతారెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. టీడీపీ బాధ్యతను మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఈయనకు అండగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛను పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇతర పథకాల పట్ల జనాల్లో సానుకూలత వ్యక్తమవుతోందని టీడీపీ భావిస్తోంది. అయితే జగన్ సొంతూరు కావడం తమ అభ్యర్థిని గట్టెక్కిస్తుందని వైసీపీ భావిస్తోంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు.

బెదిరింపులు షురూ

మూడురోజులుగా వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున వలసలు వస్తున్నాయి. ఇప్పటికే కొత్తపల్లెకు చెందిన వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పుష్పనాథరెడ్డి, సర్పంచ్ ప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ కమలమ్మ, పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, అచ్చవెల్లి సర్పంచ్ షరీఫ్, వెంగమ్మ, జయచంద్రారెడ్డి, ఈ.కొత్తపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీనిని వైసీపీ జీర్ణించుకోలేక పోతోంది. టీడీపీ నేతలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వివేకా హత్య కేసులో నిందితుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి బెదిరించారంటూ విశ్వనాథరెడ్డి ఆరోపించారు. నామినేషన్ విత్‌డ్రాకు ముందే ఇక్కడ బెదిరింపులు ఎదురు కావడం చూస్తే ఈ ఎన్నిక ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతుంది. పులివెందుల జడ్పీటీసీ పరిధిలో మొత్తం 10,400 ఓట్లు ఉన్నాయి.

ఒంటిమిట్ట టీడీపీలో గ్రూపుల గోల

ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి వైసీపీ నుంచి మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. ఇప్పటికే అటు అన్నమయ్య జిల్లా ఇటు కడప జిల్లాకు చెందిన వైసీపీ నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ టీడీపీ ఇంతవరకు జడ్పీటీసీ అభ్యర్థిని ఖరారు చేయలేని స్థితిలో ఉంది. స్థానికంగా టీడీపీలో రెండు గ్రూపులున్నాయి. ఒకటి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గం కాగా, మరొకటి ఆయనకు వ్యతిరేక వర్గం. ఇక్కడ టీడీపీ అభ్యర్థిని ఐవీఆర్‌కాల్స్ ద్వారా మంగళవారం ఎంపిక చేస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక జగన్ సొంత జిల్లాలో తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఇది అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం. ఎందుకంటే ఈ రెండు సీట్లు వైసీపీవే. ఇక్కడ గెలుచుకుంటే వైసీపీకి జిల్లాలో అంత సీన్ లేదని చెప్పుకునేందుకు టీడీపీకి అవకాశం ఉంటుంది. అయితే పులివెందులలో టీడీపీ భారీ ఫైట్ చేస్తున్నప్పటికీ ఒంటిమిట్టలో ఆ పరిస్థితి కనిపించకపోవడం కూటమి శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఒంటిమిట్ట కడప జిల్లాలో ఉన్నప్పటికీ ఇది రాజంపేట అసెంబ్లీ పరిధిలో ఉంది. జిల్లా పరంగా చూస్తే కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, అన్నమయ్య జిల్లాకు చెందిన రాంప్రసాద్‌రెడ్డిలకు ఒంటిమిట్ట ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారనుంది. ఇక్కడ టీడీపీ బలమైన వ్యక్తిని బరిలో నిలిపి వైసీపీకి ముకుతాడు వేస్తుందో లేదో నేడు తేలనుంది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పులివెందుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. సోమవారం సాయంత్రం ఆయన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన నల్లపురెడ్డిపల్లె, మోట్నూతలపల్లె, ఇ.కొత్తపల్లె, ఆర్.తుమ్మలపల్లెలను పరిశీలించారు. డీఎస్పీ మురళినాయక్, సీఐలు ఉలసయ్య, వెంకటరమణతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ పోలింగ్ కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

పులివెందుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుపుతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎర్రిపల్లెలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి తరపున ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సవిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం రాష్ట్రంలో ఏర్పడినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోంద న్నారు. ఇప్పటికే పెంచిన పింఛన్‌లు అందిం చామన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ అమలు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిందంతా దోచుకోవడం, దాచు కోవడం లాగానే సాగిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో అరాచకం తాండవించిందన్నారు. కాగా.. పులివెందుల మండలంలోని ఆర్.తుమ్మల పల్లెలో టీడీపీ ఇంటింటి ప్రచారం సాగించింది. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, టీడీపీపొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి సవిత, కూటమి జడ్పీటీసీ అభ్యర్థి లతారెడ్డి

మైలవరం జలాశయానికి నీరు నిలుపుదల

కొండాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి నీరు నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం గరిష్ట నీటిమట్టం 5.302 టీఎంసీలకు చేరుకోవడంతో నీటిని నిలుపుదల చేశామని ఈఈ తెలిపారు. అదేవిధంగా సోమవారం గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా వచ్చే ఇన్‌ఫ్లో 11,500 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

'మీకోసం' తాత్కాలిక రద్దు

- ఇబ్బంది పడ్డ అర్జీదారులు



కలెక్టరేట్‌లోని సభాభవనానికి తాళాలు వేసిన దృశ్యం

కడప కలెక్టరేట్,ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ విషయంపై అధికారులు ముందస్తుగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో జిల్లా నలు మూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్జీలు రాసుకుని, కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే సిబ్బందికి వీటిని సమర్పించాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జనాలు వస్తుండడంతో సభాభవన్‌కు అధికారులు తాళాలు వేసేశారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నికల నేపథ్యంలో కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తాత్కాలికంగా మీకోసం కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.



పీజీఆర్ఎస్‌లో ఇచ్చేందుకు అర్జీలు రాయించుకుంటున్న ప్రజలు

బెదిరిస్తే భయపడేది లేదు

- ఎమ్మెల్యే ఆది, బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి టీడీపీలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీ పీఏ రాఘవరెడ్డి బెదిరిస్తున్నారని.. వారి బెదిరింపులకు భయపడేది లేదని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో ఓడిపోతామని భయపడే అందరూ రంగంలోకి దిగుతున్నారన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ కోర్టు నిబంధనల ప్రకారం వివేకానందరెడ్డి హత్య కేసులో ఉన్న భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డి హైదరాబాద్ ప్రాంతంలోనే ఉండాలన్నారు. కానీ వీరు కర్నూలు వరకు వచ్చి విశ్వనాథరెడ్డికి ఫోన్ చేశారన్నారు. అంటే కోర్టు నిబంధనలను ఉల్లంఘించారని తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు బాయ్‌కాట్ చేసేందుకు వైసీపీ కారణాలు వెతుక్కునే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పోలీసులతో గెలిచే ప్రయత్నం

- ఎంపీ అవినాశ్‌రెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ధనబలంతోను, పోలీసులను అడ్డుపెట్టుకొని ఈ ఉప ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అచ్చవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తోందన్నారు. అయినా ప్రభుత్వం ఇది చేశామని చెప్పుకొనే పరిస్థితి లేదన్నారు. ఎవరు ఏమి చేసినా పులివెందుల ఖ్యాతిని మరోసారి చాటిచెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాగా.. అధికారబలాన్ని ఉపయోగించకుండా, పోలీసులను అడ్డుపెట్టుకోకుండా ప్రజాస్వామ్యపద్ధతిలో పోలింగ్ నిర్వహించి గెలిచి చూపించాలని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందుల వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్ని ప్రలోభాలకు, ఎన్ని బెదిరింపులకు దిగినా, ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా జడ్పీటీసీ గెలుస్తామన్నారు.

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం


కడప కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జేసీ చాంబర్‌లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు కాళ్లు, చేతులు కడుక్కోవాలన్నారు. అందరూ మరుగుదొడ్లు వాడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఈ నెల 12 వ తేదీ నుంచి 20 వరకు ఆల్బెండజోల్ మాత్రలను మోతాదు మేరకు మింగించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆశాలు, అంగన్వాడీలు, స్వయం సహాయక బృందాలు కలసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం ప్రాముఖ్యతను తెలిపే వాల్‌పోస్టర్‌ను జేసీ అదితి సింగ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ నులిపురుగుల పోస్టర్‌ను అధికారులతో కలసి ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

బెదిరింపులపై డీఎస్పీకి ఫిర్యాదు

పులివెందుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసు నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డితో పాటు ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి, తుమ్మలపల్లెకు చెందిన గంగాధర్‌రెడ్డి తనను బెదిరించారంటూ పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి డీఎస్పీకి సోమవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీ పీఏ రాఘవరెడ్డి, తుమ్మలపల్లెకు చెందిన గంగాదర్‌రెడ్డిలు పదేపదే అసభ్య పదజాలంతో మాట్లాడి మానసికంగా ఇబ్బంది పెట్టారని, భౌతికంగా కూడా ఇబ్బంది పెడతారేమోనని అనుమానంతో ఫిర్యాదు చేస్తున్నా అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిల ఫోన్లు తాను ఎత్తకపోవడంతో తమ గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి ఫోన్ చేసి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. తన ఫోన్ నెంబర్‌కు ఎప్పుడెప్పుడు, ఎవరెవరు ఫోన్ చేసింది పూర్తి ఆధారాలతో ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుతో పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు సమాచారం. విశ్వనాథరెడ్డికి వచ్చిన ఫోన్‌కాల్స్ ఆధారంగా విచారణ అనంతరం ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లను చేర్చే అవకాశం ఉంది. ఈ విషయమై వివరణ కోరేందుకు డీఎస్పీకి ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కాగా పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిని బెదిరించిన విషయమై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత డీజీపీకి ఫోన్ చేసి మాట్లాడారని తెలిసింది. ఎవరైన వారికి నచ్చిన పార్టీలో వారికి నచ్చిన సిద్ధాంతాల ప్రకారం ఉండడం వారి ఇష్టమన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూడా డీజీపీతో మాట్లాడారు. కాల్‌లిస్టు ఆధారంగా వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



విశ్వనాథరెడ్డి ఫోన్‌కు వాట్సప్ కాల్ చేసిన దృశ్యం

కేంద్ర పథకాలు సద్వినియోగం కావాలి

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో అర్హులకు సద్వినియోగం కావాలని కేంద్ర పర్యవేక్షణ బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం చెన్నూరు మండలం ముండ్లపల్లెలో కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల అమలు తీరుపై అక్కడ ప్రజలు, రైతులు, లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు సక్రమంగా అమలవుతున్నాయా, సద్వినియోగం చేసుకుంటున్నారా అనే విషయాలపై మండలంలో మూడురోజుల పాటు పరిశీలిస్తామన్నారు. అందులో భాగంగా మొదటిరోజు ముండ్లపల్లెలో ఉపాధి కూలీలు, పింఛనుదారులు, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్ ద్వారా జరిగిన అభివృద్ధి పనులు పరిశీలించామన్నారు. ఏడాదిలో వందరోజులు పనిదినాలు ఉన్నాయా, ఉదయం ఎన్నిగంటలకు పనులకు వెళుతున్నారు, మీకు వచ్చే కూలీ ఎంత, అర్హులకు పింఛను వస్తుందా, ఇల్లు లేకపోతే ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేస్తుందా తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగా చదువుకున్న నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉన్నతి పథకంలో భాగంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆరునెలలు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో భృతి ఇవ్వడంతో ఆరునెలల అనంతరం వారి స్థాయికి తగినట్లు కంపెనీలతో మాటాడి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామన్నారు. అలాగే స్వయం సహాయక బృందాల ద్వారా పురోగతి సాధించి వారితో మాట్లాడి వారి ఆర్థిక పరిపుష్టికి కేంద్రం మరింత మంచి అవకాశాలు కల్పిస్తుంద న్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీలు రామలింగేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఆనంద్, ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాదేవి, ఏపీవో వెంకటేశ్, ఏపీయం శైలజ రఘు, హౌసింగ్ ఏఈ మినిల్‌కుమార్, పీఆర్ ఏఈ మల్లికార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి

ఐరిస్ స్కానర్లు ఎక్కడ..?

- ఆచూకీ లేని 50 యంత్రాలు
- ఎండీయూ ఆపరేటర్లను వెంటాడుతున్న డీటీలు
- వాపసు చేయకుంటే రూ.6400 చెల్లించాల్సిందే..
- ట్రక్కు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం

పౌర సరఫరాల శాఖ ఎండీయూ ఆపరేటర్లకు అందించిన ఐరిస్ స్కానింగ్ యంత్రాలను వాపసు తీసుకోవాలంటూ ఆ శాఖ కమిషనర్ తహసీల్దార్, సీఎస్‌డీటీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా వేలిముద్రలు పడని వృద్ధులు, తదితరులకు రేషన్ పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు విజన్‌టెక్స్ కంపెనీ ద్వారా ఐరిస్ స్కానింగ్ డివైజ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో, ఈ యంత్రాలను ఆపరేటర్ల నుంచి వాపసు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది.

మదనపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా రేషన్ షాపులోనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచంలో నుంచి లేవలేని వారికి మాత్రం వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ అందజేస్తున్నారు. ఇలాంటి వారిలో చాలామంది వేలిముద్రలను బయోమెట్రిక్ యంత్రాలు గుర్తించలేపోతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఐరిస్ స్కానింగ్ ద్వారా నమోదు చేసి నిత్యావసర వస్తువులు అందజేయాలని, ఇందుకు అవసరమైన యంత్రాలను అప్పటి ఎండీయూ ఆపరేటర్ల నుంచి స్వాధీనం చేసుకుని డీలర్లకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు చేయడంతో తహసీల్దార్, సీఎస్‌డీటీలు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

● రూ.6400 చెల్లించాల్సిందే..

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్లలోని 30 మండలాల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీకి 310 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. వీటిలో ప్రతి వాహనానికి ఒక్కో ఐరిస్ స్కానర్ డివైజ్ అందజేసింది. ప్రస్తుతం 250 మంది ఎండీయూ ఆపరేటర్లు వాటిని తిరిగి సీఎస్‌డీటీలకు అప్పగించగా మిగిలిన వారంతా పలు రకాల సమాధానాలు చెబుతున్నారు. అలా అంటే కుదరదని, ఇచ్చిన వస్తువును వాపసు చేయాల్సిందేనంటూ ప్రభుత్వం తెగేసి చెబుతోంది. ఒకవేళ డివైజ్ అప్పగించకుంటే రూ.6400 చెల్లించాలని షరతు విధించింది. లేకుంటే, ట్రక్కుకు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో రూ.6 లక్షల విలువ చేసే ట్రక్కును పదిశాతం లబ్ధిదారుడి వాటాతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణం మంజూరు చేశారు. ఇప్పటికే నాలుగేళ్లకు పైగా ఈఎంఐలు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులకు చెల్లించి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎండీయూ ఆపరేటర్లుగా పని చేసిన ట్రక్కు డ్రైవర్లు వెంటనే ఐరిస్ స్కానర్లను అప్పగించాలని క్షేత్రస్థాయిలో సీఎస్‌డీటీ లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మండలాల వారీగా రేషన్ డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అంశాన్ని వివరిస్తున్నారు. ఇప్పటికే అందిన ఐరిస్ స్కానర్లను ఆయా ప్రాంతాల్లో ఎక్కువ కార్డులున్న డీలర్లకు అప్పగించారు.

● 50 డివైజ్‌ల ఆచూకీ లేదు

జిల్లాలో 310 ఐరిస్ స్కానర్లను అప్పట్లో ట్రక్కు డ్రైవర్లకు అందజేయగా, ప్రస్తుతం 250 మంది వాటిని వాపసు చేశారు. మిగిలిన వారంతా తమకు ఇవ్వలేదని, తాము మధ్యలోనే నిత్యావసర వస్తువుల పంపిణీ ఆపేసి, మరొకరికి ట్రక్కును అప్పగించామని, ఎక్కడో పోయింది.. కనిపించడంలేదని ఇలా పలు విధాలుగా సమాధానం వస్తుండగా, మరికొందరు ఉపాధి నిమిత్తం బయటి దేశాలకు వెళ్లినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, అప్పట్లో పేరుకే 310 వాహనాలు ఉన్నా తర్వాత ఏడాది నుంచి 240 నుంచి 250 వాహనాలే పనిచేసినట్లు చెబుతున్నారు. మిగిలిన కొందరు వివిధ కారణాలతో రాజీనామా చేయగా, మరికొందరు మధ్యలో ఇతరులకు వాహనాన్ని అప్పగించారు. మరికొందరు, ఎండీయూను పక్కన పెట్టి వీఆర్వోల అథెంటికేషన్‌తో రేషన్‌షాపులో పంపిణీ చేశారు. మొత్తమ్మీద 240 నుంచి 250 మందికి మాత్రమే పౌరసరఫరాల శాఖ అధికారులు అప్పట్లో ఎండీయూలకు జీతాలు చెల్లించినట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న డివైజ్‌లను సీఎస్‌డీటీలకు అప్పగించగా, ఇక మిగిలిన 50 డివైజ్‌లను ఎలా రికవరీ చేయాలన్నదే వారికి తలనొప్పిగా మారింది. అయితే అవి ఎక్కడ, ఎవరి వద్ద ఉన్నాయి..అసలు ఉన్నాయా? లేదా? అంటూ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందుకోసం వాటిని అప్పగించే సమయంలో జారీ చేసిన అక్విటెన్స్ ఆధారంగా వెతుకుతున్నారు.


ఐరిస్ స్కాన్ చేస్తున్న డీలర్

బాక్సింగ్ క్రీడాకారుడికి సన్మానం

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన నందలూరు గ్రామ వీఆర్వో జగదీశ్‌ను సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందిన ఎం.జగదీశ్ క్రీడల్లో ఎంతో మందికి ఆదర్శప్రాయమన్నారు. అన్నమయ్య జిల్లా యువత జగదీశ్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఈయనకు పతకాలు పొందే లా శిక్షణ ఇచ్చిన ఆయన కోచ్ ఆనంద్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించి మరింత మంది క్రీడాకారులు ఈ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని సూచించారు.


బాక్సింగ్ క్రీడాకారుడు, వీఆర్వో జగదీశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీ

వాచ్‌మెన్ వేతనాల బకాయిలు చెల్లించాలి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహులు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ పీలేరు నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి కే. నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పీలేరు ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో 5333 మంది నైట్ వాచ్‌మెన్‌గా రూ.6 వేల గౌరవ వేతనానికి పని చేస్తున్నారని తెలిపారు. ఐదు నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారిని కలసి బకాయిలు చెల్లించాలని కోరినా, ఇప్పటి వరకూ ఆ దిశగా ఎటువంటి ముందడుగు పడలేదని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఏఐటీయూసీ తరఫున పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు డీ. యశోద, టీ. రమణ, పీ. రెడ్డెప్ప, బీ. చిన్నప్ప పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో విద్యార్థినుల ప్రతిభ

ఓబులవారిపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తమిళనాడులో జరిగిన ఆలిండియా టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ కనబరచినట్లు ప్రధానోపాధ్యాయురాలు బుజ్జమ్మ తెలిపారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో పదో తరగతి విద్యార్థినులు భాను, సారా మూడో బహుమతిని సాధించారన్నారు.


విద్యార్థినులతో పీడీ పద్మావతి

ఎనిమిది మంది పాత నేరస్థుల బైండోవర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ఎనిమిది మందిని పోలీసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ సమాజంలో సత్‌ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఇకపై నేరాల జోలికి వెళ్లకూడదని వారిని హెచ్చరించారు. పాత నేరస్థుల నుంచి సంతకాలు తీసుకుని పంపివేశారు.

పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమా కోసం ఈనెల 14 లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజన కింద పసుపు, ఉల్లి పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పొడిగించిందన్నారు. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిమ్మనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు లాగుతుండగా షాక్ తగలడంతో స్తంభం పైనుంచి పడి గాయపడిన ఓ కూలీ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, దినాజ్పూర్ జిల్లా, బన్సిహరి పంచాయతీ, రూపహత గ్రామానికి చెందిన సునీరం హింబ్రం(30) విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులకు కూలీగా వచ్చాడు. గత బుధవారం తీగలు లాగుతుండగా, హఠాత్తుగా విద్యుత్ ప్రసారం కావడంతో అతను స్తంభం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని మదనపల్లి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు మృతునికి మూడేళ్ల క్రితం పెళ్లికాగా భార్యతో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. అతని తమ్ముడు గోపాల చంద్ హిమ్బ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సునీరం హింబ్రం మృతదేహం

కడప రిమ్స్‌లో ..

రామాపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ హరిజనవాడకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామానికి చెందిన బోనంశెట్టి రవీంద్ర (56) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని కడపలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీంద్రకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాయిదాలకు హాజరు కానందుకు అరెస్ట్

నందలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరు కానందుకు ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతి పట్టణం కరకంబేడు వీధికి చెందిన చంద్రరమేష్ రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడు. వాయిదాలకు హాజరు కాకపోవడంతో నందలూరు కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో నిందితు డినిఅదుపులోకి తీసుకుని సోమవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు తెలి పారు.


పోలీసుల అదుపులో చంద్రరమేష్

కొరియర్ వాహనం అదుపు తప్పి బోల్తా..

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కొరియర్ వాహనం అదుపు తప్పి వాహనం బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కడప నుంచి బద్వేలుకు కొరియర్ పార్శిళ్లు తీసుకెళుతున్న వాహనం సోమవారం స్థానిక పరమాత్మ సేవా వృద్ధాశ్రమం సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, వంకలో పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న కిశోర్, చాంద్‌బాషా స్వల్పంగా గాయపడ్డారు. 108లో వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

తరగతి గదిలో జారి పడి విద్యార్థికి గాయాలు

● పట్టించుకోని ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో కాలు జారిపడడంతో ఓ విద్యార్ధి గాయపడ్డాడు. మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవులరెడ్డిపల్లెకు చెందిన ఆవుల తిప్పారెడ్డి, కవిత దంపతుల కుమారుడు ఆవుల మల్లికార్జున 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం తరగతి గదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో అతని చెయ్యి విరిగింది. గమనించిన తోటి విద్యార్థులు ఫోన్ చేయడంతో 108 వాహన పైలెట్ రాజు, ఈఎంటీ సాంబశివ విద్యార్థిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అక్కడి వైద్యులు పరిక్షించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి గాయాలైనా ప్రధానోపాధ్యాయుడు కానీ, ఉపాధ్యాయులు కానీ పట్టించుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గాయపడిన మల్లికార్జున

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకనుంచి ఆటో ఢీకొనడంతో ఓ వృద్ధురాలు చెందింది. కేవీ పల్లె మండలం నూతనకాల్వ దండువారి పల్లెకు చెందిన చింతపర్తి మంగమ్మ (82) కలికిరిక్రాస్ రోడ్డులోని మనుమరాలి ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం మనుమరాలితో కలిసి దీప్తి బట్టల దుకాణం వద్ద నడిచి వెళుతుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిన ఆమె తలకు బలమైన గాయమైంది. అదే ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా ప్రాథమిక చికిత్స చేసి, తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ మదనమోహన రెడ్డి చెప్పారు. కుమార్తె రామకుమారి ఫిర్యాదు ఆటో డ్రైవరు సుబహాన్ మీద కలికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి వచ్చిన సర్వే సమస్యలన్నింటికీ వారం రోజుల్లో పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే)లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలు, ఇతర కారణాలతో డివిజన్‌లోని 11 మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సర్వేకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరించడంలో ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. ప్రతి మండలాన్ని పరిశీలించి, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించి వెంటనే సర్వే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మదనపల్లె మండలంలో ఎక్కువగా సర్వేలు పెండింగ్ ఉన్నాయని ప్రశ్నించగా, మండల సర్వేయర్ సరిగ్గా స్పందించడం లేదని డీఐ బదులిచ్చారు. మదనపల్లె మండల సర్వేయర్‌పై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐలు వెంకటరమణనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సర్వే సమస్యలపై డీఐలతో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత పీలేరు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పీలేరు . రన్నర్స్‌గా రాజంపేట జట్టు నిలిచాయి. యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్, చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాలుగు జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పీలేరు జట్టు కప్పు కైవసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జోహర్ నిలిచారు.

చెస్ పోటీ విజేత నాగేంద్ర....

చదరంగం పోటీ విజేతగా రాజంపేటకు చెందిన రాజేంద్ర నిలిచారు. మొత్తం 20 మంది మధ్య ఆసక్తికర పోటీ సాగింది. ఇందులో రాజేంద్ర విజేత కాగా, ద్వితీయ స్థానంలో కలకడకు చెందిన సుబ్బరాయుడు నిలిచారు. విజేతలకు అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఉపా ధ్యాయుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ట్రెజరర్ బీ. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ బాషా, రమణ మూర్తి, జిల్లా క్రీడా విభాగపు కన్వీనర్ సుధాకర్, రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. రెడ్డిప్రదీప్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నరసరాజు, వివిద మండ లాల యూనియన్ నాయకులు పీరయ్య, వెంకటరమణ, విజయ్ కుమార్, రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పీలేరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

పేదరిక నిర్మూలనే లక్ష్యం

సంబేపల్లె, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మహిళా పేదిరక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. పేదరిక నిర్మూలన సంస్థ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సౌజన్యంతో గున్నికుంట్ల గ్రకామంలోని వినాయక స్వయం సహాయక సంఘం అందజేసిన ఎగ్ కార్ట్‌ను సోమవారం పీడీ సత్యనారాయణ ప్రారంభించారు. యాభై వేల రూపాయలు విలువ చేసే ఎగ్ కార్ట్‌ను వినాయక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన రాజేశ్వరికి ఉచితంగా అందజేశారు. నెలకు ఇరువై నుండి ఇరవై అయిదు వేల రూపాయల ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీపీయం ప్రసాద్‌రెడ్డి, వేణుమాధవ, రమేశ్, గంగార్జున, సంజీవ రాజు, సీసీ నాగరాజురావు, ఇతర ప్రాజెక్టు సిబ్బంది పాల్గొనడం జరిగింది.


ఎగ్ కార్టును ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాజంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుదాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఉదయం 10 గంటలకు పదో తరగతి మార్కుల లిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తదితర ధ్రువపత్రాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు మెండుగా ఉన్న ఈ కోర్సుల్లో ప్రవేశం పొంది తమ భవిష్యత్‌కు మార్గం సుగమం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం'

● జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పీలేరు ఎంపిక ● ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని రీ సైక్లింగ్ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో గుంటూరు జిల్లాలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్టు ప్రవేశపెట్టారు. ప్రతి జిల్లాలో ఒక గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలన్న పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో జిల్లాలోని పీలేరు మేజర్ పంచాయతీని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంపిక చేసినట్లు డీపీవో రాధమ్మ తెలిపారు. ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో.. తమకు జీవనాధారం కల్పించాలని ఆపరేటర్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ సమస్య పరిష్కరించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలసిపోకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛరథం కార్యక్రమం ప్రారంభించి వారికి ఉపాధి కల్పించనుంది.


గుంటూరు జిల్లాలో ప్రారంభించిన స్వచ్ఛరథం

చెత్తకు బదులుగా నిత్యావసర వస్తువులు

గ్రామాల్లో ప్లాస్టిక్, గాజు సీసాలు, పాత ఇనుప సామాన్లకు బదులుగా నిత్యావసర వస్తువులైన సబ్బులు, షాంపూలు, గోధుమ పిండి, ఎర్రగడ్డలు, కందిపప్పు తదితర వస్తువులను పంపిణీ చేస్తారు. ఎండీయూ ఆపరేటర్ ప్రజల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు పెంకులు, అట్టపెట్టెలు, పాత ఇనుప సామాను తదితరాలను సేకరించి కిలోకు కొంత మొత్త చొప్పున చెల్లిస్తారు. అయితే, నగదుకు బదులు ఇంట్లోకి అవసరమయ్యే వస్తువులను ఇస్తారు.

ఎండీయూ ఆపరేటర్‌కు నెలకు రూ.25 వేలు వేతనం

స్వచ్ఛరథం నిర్వహించే ఎండీయూ ఆపరేటర్‌కు ఆయా గ్రామ పంచాయతీ జనరల్ నిధుల నుంచి ప్రతి నెలా రూ.25 వేలు చెల్లించనున్నారు. స్వచ్ఛరథం వీధుల్లో తిరుగుతూ ప్రజల నుంచి పొడి చెత్త (ప్లాస్టిక్, గాజు, ఇనుప వ్యర్థాలను) కేజీల లెక్కన తీసుకుంటారు. ఈ చెత్తను స్వచ్ఛరథంలో అమర్చిన అరల్లో ఉంచి, ఆ చెత్త ఎంత విలువ చేస్తుందో లెక్కించి పక్కనే ఉన్న నిత్యావసర వస్తువులను లెక్కవేసి ప్రజలకు చెల్లిస్తారు. ఈ విధానంలో సత్ఫలితాలు వస్తే ప్రతి మండల కేంద్రంలోనూ స్వచ్ఛరథం ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచనలో ఉంది.

పీలేరుకు స్వచ్ఛరథం కేటాయింపు

జిల్లాలోని మేజర్ పంచాయతీ అయిన పీలేరుకు స్వచ్ఛరథం కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. పీలేరు గ్రామ పంచాయతీలో 10,755 కుటుంబాలకు గాను 41,503 మంది నివసిస్తున్నారు. ఈ పంచాయతీ నుంచి నిత్యం ఐదు ట్రాక్టర్లతో చెత్త సేకరిస్తుండగా వీటిలో 390 కిలోల పొడి చెత్త, 600 కిలోల తడి చెత్త వస్తోంది. ఈ చెత్తంతా కంపోస్టు యార్డులో వ్యర్థంగా పడేయకుండా, ఇప్పుడు ప్రవేశపెట్టనున్న స్వచ్ఛరథం వద్ద విక్రయిస్తే అటు ప్రజలకు ఆదాయం, ఇటు జీవ వైవిధ్యం కాపాడినట్లు అవుతుంది. ఈ వినూత్న విధానం విజయం సాధిస్తుందని నమ్మకం వుంది.

-రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి, రాయచోటి

అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా..

- భోరున విలపించిన కుటాగుళోళ్లపల్లె
- అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు


కుటాగుళోళ్లపల్లెలో మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ములకలచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రే.. లేవరా నాన్నా.. అక్క వచ్చింది.. నాన్న పిలుస్తున్నాడు.. బాబాయ్ వచ్చాడు.. ఒక్కసారి లేవరా.. అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబ సభ్యులు గుండెలు పగి లేలా రోదిస్తున్న దృశ్యాలు కలచి వేశాయి. ములకలచెరువు మండలం పెద్ద పాళ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్(26), తరుణ్(24), మనోజ్(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే.. పోస్టుమార్టం అనంతరం వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామానికి తీసుకు రావడంతో చివరి చూపు చూసేందుకు గ్రామం మొత్తం తరలివచ్చింది. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి వెళ్ళి యువకుల కుటుంబాలకు పరామర్శించారు. గ్రామానికి వచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఒక్కో కుటుంబానిది.. ఒక్కో దీనగాథ

వ్యవసాయ కూలీలైన కుటాగుళోళ్లపల్లె చంద్రప్ప, రత్నమ్మ దంపతులు కుమార్తె సుజాతకు ఐదేళ్ళ క్రితం పెళ్ళి చేశారు. డిగ్రీ వరకు చదువుకున్న కుమారుడు వెంకటేశ్ ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నాడు. వేమనారాయణ, శ్యామలమ్మ దంపతులు కూడా వ్యవసాయ కూలీలే. వీరి పెద్ద కుమారుడు కేశవ బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, తరుణ్ ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం వెతుకుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓబులేసు, కవిత దంపతులకు ఇద్దరు కూతుళ్లుండగా, కుమారుడు మనోజ్ బెంగళూరులో బీటెక్ చదువుతున్నాడు. వీరంతా ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు అండగా నిలుస్తారని భావిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.

ఒకే రాత్రి నలుగురు దుర్మరణం

మండలంలో ఆదివారం రాత్రి కాళరాత్రిగా మారింది. ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వద్ద జరిగిన ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్, తరుణ్, మనోజ్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన జరిగిన గంట వ్యవధిలోనే బురకాయలకోట పంచాయతీ ఎర్రమాసివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు ములకల చెరువు నుంచి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. శ్రీనివాసులు నాయుడు రైతు. ఇతనికి భార్య నిర్మల, ఇద్దరు కుమారులు వెంకటేష్, బాలాజీ ఉన్నారు. పెద్దకుమారుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు బాలాజీ డిగ్రీ చదువుతున్నాడు. టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, మూగి రవిచంద్ర, ముత్తుకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమ రాజు, అశోక్ కుమార్, భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతోపాటు, గ్రామంలో అంత్యక్రియలకు హాజరయ్యారు.

పెళ్లి చేసుకుంటానని మోసం... వ్యక్తిపై కేసు నమోదు

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భిణిని చేసి.. మోసగించిన వ్యక్తిపై ఓ మహిళ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు విచారణ చేస్తున్నట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చెన్నూరు వనంవీధికి చెందిన పెరుగు శివశంకర్‌కు ఓ మహిళతో ఐదేళ్లక్రితం పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి నమ్మించి 17 తులాల బంగారు, 7లక్షల డబ్బులు తన జల్సాలకు వాడుకున్నాడు. ప్రస్తుతం ఆమె నాలుగు నెలల గర్భిణి.. వివాహం చేసుకోమని అడిగితే.. గత నెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడని.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ ఉండాడో తెలియడం లేదని.. తనకు న్యాయం చేయాలంటూ బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొండపేటలో ఘర్షణ ... కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో సోమవారం జరిగిన ఘర్షణపై ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. స్థలం విషయంలో జక్కల మరియమ్మ, జక్కల ఆదిలక్షుమ్మ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు జక్కల మరియమ్మ, జయన్న, భాస్కర్, జక్కల ఆదిలక్షుమ్మ, ఇండ్ల జయరాములు, రమేష్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణ కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మనస్పర్థల కారణంగా జూలై 28న రాజు ఇంటిలోకి జొరబడి సంపత్, గణేశ్, శివలు దాడి చేశారు. ఇంటిలోని వస్తువలన్నీ చిందర వందర చేశారు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురిని ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి


గాయపడిన సురేష్

మైదుకూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ సురేష్‌పై అదే గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి బిల్లులు బాగా వసూలు చేస్తారు.. కరెంటు ఎందుకు వదలలేదంటూ వాగ్వాదానికి దిగి సురేష్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయపడిన సురేష్‌ను స్థానికులు 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పల్సర్ బైకు పోయిందని ఫిర్యాదు

పోరుమామిళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డిపేట గ్రామానికి చెందిన బొజ్జ సురేశ్ అనే వ్యక్తి తన పల్సర్ బైకు పోయిందని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కమ్మవారిపల్లె గ్రామంలో తన ఓనరు ఇంటి వద్ద బైకు పెట్టి ఎక్స్‌కవేటర్‌తో పనులకు వెళ్లానని, సోమవారం ఉదయం వచ్చి చూడగా అక్కడ కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ బాండ్లు అందజేత



దువ్వూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు గ్రామానికి చెందిన మల్లేష్‌భార్య సుమలత నలుగురు కుమార్తెల పేరున పోస్టాఫీసులో టర్మ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన బాండ్లను సోమవారం కానగూడూరు పోస్టాఫీసు బీపీఎం ప్రసాద్ ఎంపీడీవో రామకృష్ణయ్యకు తెచ్చి చూపించారు. గత డిసెంబరు 20న రైతు మల్లేష్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం, ఈ కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడం జరిగింది. దీనికి అమెరికా ఎన్‌ఆర్‌ఐ స్పందించి రూ.లక్ష ఆర్థికసాయం కుటుంబానికి అందజేయడంతో బాధిత కుటుంబంలోని నలుగురు ఆడపిల్లలు గురునాగ పల్లవి, గురునాగ వర్షిత, గురునాగ భార్గవి, గురునాగ నిత్య పేర్ల మీద రూ.25 వేలు చొప్పున డిపాజిట్ చేశారు. సదరు బాండ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు.

జిల్లాకు 1,321 టన్నుల యూరియా


కడప రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ తదితరులు

కడప రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాల కోసం సోమవారం కడప రైల్వేస్టేషన్‌కు 1,321 టన్నుల యూరియా వచ్చింది. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని కేటాయించిన పరిణామాలను ఆ యా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాకు 942 టన్నులు రాగా వాటిలో 516 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 426 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 380టన్నులు రాగా అందులో ప్రైవేట్ డీలర్లకు 145 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 235 టన్నులు పంపిణీ చేశారు.

రైతుల ఆలోచనలను పరిగణలోకి తీసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సీకేదిన్నె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచనలను శాస్త్రవేత్తలు పరిగణలోకి తీసుకుని పంటల సాగులో అమలు పరచడం ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ తెలిపారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ వ్యవసాయంలో ఎప్పుడు ఏమి చేయాలో తెలుసుకుని ఉంటారని... వారి ఆలోచలను కార్యరూపంలో పెడితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రైతులే శాస్త్రవేత్తలుగా పంటలకు రక్షణగా నిలస్తారని.. అందుకు సాంకేతిక సహకారం అందించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందన్నారు.
వ్యవసాయ పరిశోధన శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ వీరయ్యాలు రైతులకు, శాస్త్రవేత్తలు అందించాల్సిన సూచనలు గురించి వివరించారు. శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి, మాధురి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులతో కలిసి చర్చించారు. వరి, పసుపు, పత్తి, వేరుశనగ, మినుము తదితర పంటల్లో ఏ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో రైతులతో సమగ్రంగా తెలుసుకున్నారు. ఆత్మా పీడీ విజయలక్ష్మి పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు జాగ్రత్తలు గురించి వివరించారు. బీఆర్‌సీ ఏడీఏలు రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, ఏవోలు పద్మజ, సుచిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం : డీఈవో


ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నంరాజుపల్లె జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామ ప్రజలు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఈవో పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుబ్బయ్య పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, అదనపు తరగతి గదులు నిర్మించాలని, టాయిలెట్లు, కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తే చుట్టుపక్కల విద్యార్థులు పాఠశాలలో చేరి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఈవో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శోభారాణి, పాఠశాల హెడ్‌టీచర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలం, వరికుంట్ల, నాయనపల్లె, ఆకుల నారాయణపల్లె, సావిశెట్టిపల్లె, అక్కెంగుండ్ల, ఇటుకలపాడు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు భూమి, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఈ గ్రామాలలోని నిరుపేదలకు స్వంత భూమి లేక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, కరువు వచ్చినపుడు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని వాపోయారు. ఇతర ప్రాంతాల వారు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.అన్వేష్ మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములను సైతం కబ్జాదారులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని, పేదలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలపక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, పోలయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో చెత్త వసూళ్ల అక్రమాలను నిగ్గుతేల్చాలి


విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెత్త పన్ను వసూళ్లలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిన నేపథ్యంలో అక్రమాలను నిగ్గు తేల్చాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివపేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడుకు సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు జగన్ ప్రభుత్వం కరోనా కష్టకాలంలో చెత్త వసూళ్లు చేసేందుకు నిర్ణయించారన్నారు. చెత్త బుట్టల కొనుగోళ్లలో, చెత్త బండ్ల ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్ నుంచి దాదాపు డబ్బులు చెల్లించి పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి నిజాలను వెలికితీయాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


కొత్తమాధవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఒంటిమిట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒంటిమిట్ట, కొత్తమాధవరం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈనెల 12న జరగనున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమాధవరం, ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బాబు, ఇన్‌చార్జి ఎస్‌ఐ రఫీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

34 మంది గ్రేడ్-2 వీఆర్వోల బదిలీ

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న 45 మంది గ్రేడ్-1 వీఆర్వో లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మదనపల్లె నుంచి 10 మంది వీఆర్వోలను బదిలీ చేయగా తాజాగా అక్కడి నుంచి మరో 9 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేశారు. మిగిలిన వారిలో గుర్రంకొండ, రామసముద్రం మండలాల నుంచి నలుగురు వంతున బదిలీ అయ్యారు. అదే విధంగా వాల్మీకిపురం, కలకడ, కురబలకోట మండలాల నుంచి ముగ్గురేసి వంతున బదిలీ జరిగింది. మొలకలచెరువు, పీటీఎం మండలాల నుంచి ఇద్దరు వంతు న, కలికిరి, సుండుపల్లె నుంచి ఒక్కొరి వంతున బదిలీ చేశారు. ఇక చిత్తూరు జిల్లా నుంచి బదిలీ మీద జిల్లాకు వచ్చిన ఇద్దరికి కూడా మండలాలు కేటాయించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవదోయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి అర్హులైనవారు ఈనెల 10 లోపుల దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు వారి బయోడేటాతో పదో తరగతి మార్కులిస్టు జిరాక్స్ కాపీ ఒక జత చేసి జవహర్ నవోదయ విద్యాలయ మెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పదో తరగతిలో మార్కుల శాతాన్ని బట్టి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

విశ్వవిద్యాలయ ప్రగతి ప్రధానం.. వీసీ


మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చి దేశ ప్రగతికి దోహదపడనున్న విశ్వవిద్యాలయ ప్రగతి మనకు ప్రధాన అజెండా అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన వివిధ విభాగాల డీన్‌లు, అన్ని విభాగాల అధిపతులతో ఆయన తన చాంబర్‌లో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ప్రొఫెసర్షిప్‌కు ఎంపికైన స్పోక్ ఇన్‌స్టిట్యూషన్‌లో యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా ఒకటని తెలిపారు. ఇక్కడి నుంచి ఒక ప్రొఫెసర్ ఎంపిక అవుతారని.. వారి పరిశోధనకు రూ.30లక్షల నిధులు ఇస్తారని వివరించారు. ఒక కమిటీ ద్వారా ప్రొఫెసర్‌ని ఎంపిక చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంపై అధికారుల మీద అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరుతామన్నారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, డీన్‌లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ప్రతిష్టలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

కొన్ని విద్యార్థి సంస్థలు పనిగట్టుకొని విశ్వవిద్యాలయ పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ అభివృద్ధికి విఘాతం కలిగిస్తూ వ్యవహరిస్తుండడం ఆవేదనకు గురిచేస్తోందని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. దేశస్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్‌లు వందలోపు ర్యాంకు, న్యాక్ ఏ గ్రేడ్‌తో అత్యున్నత పరిశోధన ప్రమాణాలతో విశ్వవిద్యాలయ ప్రగతిపథంలో వెళ్తుంటే పనిగట్టుకొని కొన్ని విద్యార్థి సంఘాలు విశ్వవిద్యాలయంపై విషం చిమ్ముతున్నాయన్నారు. నాలుగేళ్లుగా వైవీయూలో కాన్వకేషన్ నిర్వహించలేదని.. అందుకు కారణాలు అనేకం ఉండవచ్చు.. ఇదివరకుపనిచేసిన రెద్యులర్ వీసీ ఆచార్య చింతా సుధాకర్ కాన్వకేషన్ ప్రక్రియను ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వం మారడం, వీసీల మార్పురీత్యా అది ఆగిపోయిందని తెలిపారు. వైవీయూలో డిగ్రీ, పీజీ చేసిన వారు వారి ఉద్యోగ నియామకాలు, పై చదువులు, పరిశోధనలు, విదేశాలకు వెళ్లడం ఇత్యాది కారాణాలతో కాన్వకేషన్ నిర్వహించాలంటూ విద్యార్థి సంఘాలుసైతం కోరాయన్నారు. ఈ నేపథ్యంలో గౌరవ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి అనుమతి తీసుకొని ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ ఉత్సవ విగ్రహాలకు పూజలు


ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబల కల్యాణ ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవస్థాన ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్ధనచార్యుల ఆధ్వర్యంలో దేవస్థాన ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో సోమవారం ఉదయం 9గంటల నుంచి కల్యాణ మండపంలో కలశస్థాపన నిర్వహించి హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం 11కు గోపూజ నిర్వహించి ప్రదక్షిణలు చేపట్టారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా నూతన కల్యాణ విగ్రహమూర్తుల మహా సంప్రోక్షణ సందర్భంగా దాతలు బెంగుళూరుకు చెందిన గౌరీశంకరాచారి, పద్మావతమ్మ దంపతులు, రవికుమార్, నళినాక్షి దంపతులు గోపూజ కార్యక్రమం చేపట్టారు. అలాగే నూతన కల్యాణ భవనంలో హోమాలు చేశారు. ఈసందర్భంగా ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఆగస్టు 6న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కళ్యాణోత్సవం ప్రారంభమై 2027 జూలై వరకు ప్రతి నెల జరుగుతూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజరు ఈశ్వరాచారి, వేదపండితులు, కళ్యాణ మహోత్సవ దాతలు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి రూ.3,72,117లు విరాళం


విరాళమిచ్చిన దాతలు ప్రవీణ్‌కుమార్ దంపతులు, పూజలు చేస్తున్న పేరుసోముల గురుప్రసాద్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మనువరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు రూ.3,72,117లు విరాళం అందించినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్ సతీమణి అశ్వని రూ.2లక్షలు విరాళం అందించారు. అలాగే అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది పేరుసోముల గురుప్రసాద్ రూ.లక్ష, బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయ్యపల్లె గ్రామం పాతూరు గ్రామ నివాశి రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు ముచ్చర్ల శేషయ్య రూ.72,117లు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరశివకుమారస్వామికి చెక్కులు అందించినట్లు కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

'ట్రిపుల్‌ఐటి క్యాంటీన్లను అక్షయపాత్రకు ఇవ్వడం తగదు'

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ట్రిపుల్‌ఐటీలలో విద్యార్థులకు సంబంధించిన క్యాంటీన్లను అక్షయపాత్రకిచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్య దర్శి పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నిర్వహించే క్యాంటీన్లలో లోపాలు ఉన్నాయన్న పేరుతో అక్షయపాత్ర అనే సంస్థకు అప్పగించడంలోనే పెద్ద మతలబు ఉందన్నారు. ఇపుడు నిర్వహణ చేస్తున్న నిర్వాహకులకు ఒక విద్యార్థికి రోజుకు రూ.90మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఇపుడు అక్షయపాత్రకు సంస్థకు రూ.120 ఇవ్వాలని చూస్తున్నారన్నారు. దీని వెనుక అంతర్యమేమిటన్నారు. రాష్ట్రం మొత్తం ఒక వ్యక్తి నిర్వహణ చేయడం వల్ల వారికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలకి దగ్గర సంబంధాలు ఉంటాయన్నారు. దీంతో నాణ్యత లోపించే అవకాశం ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీలలో క్యాంటీన్లను అక్షయ పాత్రకిచ్చేనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థుల అత్యున్నత ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో బిల్టప్ సర్కిల్ వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు భారత జాతీయ ప్రతిభ అన్వేషణ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షల ఫలితాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. సోమవారం శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థులు పోటీ పరీక్షలలో ప్రతిభ చూపుతారని తెలిపారు. ఈ ఫలితాలలో ఏడో తరగతి విద్యార్థిని పి.యశశ్విని గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాప్, పి.భార్గవ్ మొదటి బహుమతి ట్యాబ్, భవ్యశ్రీ, నందకిషోర్ స్మార్ట్ వాచీలు వివిధ కేటగిరీలలో 150 మందికి పైగా విద్యార్థులు అనేక బహుమతులు, మెడల్స్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓబయ్య, డీన్ రెడ్డికుమార్, సీబ్యాచ్ ఇన్‌చార్జి ఈశ్వరయ్య, ఒలింపియాడ్ ఇన్‌చార్జి,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలి

కమలాపురం రూరల్ , ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కమలాపురం ఏరియా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ కమలాపురం ఏరియా అధ్యక్షుడుగా రాఘవేంద్ర, కార్యదర్శిగా షేక్ సాదిక్, ఉపాధ్యక్షుడుగా మణికంఠరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శినాగేశ్వర్‌రావు, రెడ్డయ్య, రమణ, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు న్యాయవాది బి.ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

రైతు చూపు... ఆకాశం వైపు..!

● రాలనంటున్న చినుకు ●ముందుకు సాగని ఖరీఫ్ సీజన్
●ఈపాటికే సాగులో ఉన్న పంటలు ఎండుముఖం ● రైతులను కుంగదీస్తున్న వర్షాభావం

కమలాపురం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నైరుతీ రుతుపవనాలు వచ్చి దాదాపు 40 రోజులు గడుస్తోంది. ఇప్పటికి తగినంత వర్షం కురవలేదు. ఖరీఫ్ సాగు సంక్షోభంలో పడింది. జూన్ మొదటివారం లోపే రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పలుమార్లు పొలాలను దున్నిన రైతులు, విత్తనాలను సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షం లేక సాగుకు ముందడుగు పడలేదు. పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న వంటివి విత్తడానికి నెలాఖరు వరకు సమయం ఉందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. వర్షాలు పడకపోతే సీజను దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈపాటికే రైతులు భూములు సాగుకు సిద్ధం చేసుకుని విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు విత్తేందుకు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు.: వర్షాకాలం వచ్చినా భూగర్భజలాలు పెరగలేదు. చెరువులు వెలవెలబోతున్నాయి. బోర్లలో నీరు అడుగంటడంతో ఎండిపోతున్నాయి. పత్తి, మొక్కజొన్న, మిర్చి సాగు చేస్తున్న రైతులు డ్రిప్ సిస్టం ద్వారా నీరు అందిస్తున్నారు. ఈపాటికే భూగర్భజల మట్టం పూర్తిగా పడిపోయింది. ఒక్కో బోరుకు రూ.లక్ష వరకు ఖర్చు పెట్టి 900 నుంచి వెయ్యి అడుగుల లోతు కొత్త బోరు వేయిస్తున్నారు. వాటిలోనూ పుష్కలంగా నీరు పడడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, మామిడి, నిమ్మ, బత్తాయి జామ, బొప్పాయి పంటల సాగు చేస్తున్న రైతులకు పరిస్థితి మరింత విషమంగా మారింది. బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలు కాపాడుకోవడం కష్టంగా మారింది. వర్షాభావం వల్ల వరినారు వేసేందుకు నీరు లేక వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. కమలాపురం, వల్లూరు మండలాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ముందుగానే నారు పోసిన రైతులు వాన కోసం ఎదురు చూస్తున్నర్నారు. వాన రాకపోతే నారు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. కమలాపురం నియోజకవర్గంలో వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఈపాటికే ఆరు మండలాల్లో కలిపి వేల ఎకరాల్లో పత్తి, శనగ మిర్చి సాగు చేశారు. కేవలం 30 శాతం భూముల్లోనే పంటలు సాగయ్యాయి. ఈ నెల 1 నుంచి 12 వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం తక్కువగా నమోదైంది. రెండేళ్ళ నుంచి వర్షాలు కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి ఏడాది రెండు,మూడు పంటలు పండించే భూముల్లో కూడా వర్షాలు రాక బీడుగా మారిన పరిస్థితి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వాన జాడ లేదు. బోర్లలో చుక్క నీరు లేదు. దీంతో నారు పోసేందుకు విత్తనాలు కూడా కొనుగోలు చేసేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు. వర్షాలు రాకపోతే తెచ్చిన విత్తనాలు కూడా పాడై పోతాయని రైతుల ఆలోచన.

మినుము పంట సాగు చేశాను

నాకున్న ఐదెకరాల పొలంలో మినుము పంట సాగు చేశాను. మొక్కలు బతికించుకున్నాను. వర్షం రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పంటను ట్రాక్టరుతో దున్నేస్తున్నాను. పంట పూర్తిగా వాడిపోయింది. ఇప్పుడు వాన వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు.

వాసు, రైతు, వల్లూరు


దుక్కి దున్ని వర్షం రాక బీడుగా వదిలేసిన పొలం


ఎండిపోతున్న మినుము పంట

తల్లిపాలే బిడ్డకు మొదటిటీకా

కమలాపురం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలేబిడ్డకు మొదటి టీకా అని సీడీపీవో శ్రీలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని కమలాపురం ప్రాజెక్టు పెద్దచెప్పలి సెక్టారు పరిధిలోని పెద్దచెప్పలి లో తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు.

అర్హులైన దివ్యాంగులందరికీ సహాయ పరికరాలు


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

లింగాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సహాయ పరికరాలు పొందేందుకు అర్హత సాధించిన దివ్యాంగులందరికీ త్వరలోనే శిబిరం ఏర్పాటుచేసి పరికరాల పంపిణీ చేస్తామని అలింకో వైద్య నిపుణుడు శివ, ఆశిష్, పట్నాయక్, అన్ను శుక్ల, వికలాంగుల జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీకాంత్ అన్నారు. లింగాల ఉన్నతపాఠశాలలో సోమవారం భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో), జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి పరీక్షలు నిర్వహించి సహాయ పరికరాలు అవసరం అయిన వారిని గుర్తించారు. త్వరలో సహాయ పరికరాలను పంపిణీ చేస్తామని వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

కడప సెవెన్ రోడ్స్ ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై అపోహలు విడనాడాలని ఎల్‌వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కావ్యమాధురి బెజ్జంకి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ వైద్యశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంకు ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ ఐ బ్యాంకు ద్వారా స్వచ్ఛందంగా నేత్రాలను దానం చేసేవారు, ఇతరత్రావైద్య అవసరాల రీత్యానేత్రాలు సేకరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్నియారిట్రీవల్ ప్రోగ్రాం (హెచ్‌సీఆర్‌పి) ద్వారా స్వచ్ఛంద నేత్రదానాలు, విరాళాలుఇన్ఫోసిస్ ఐ బ్యాంక్ సేకరిస్తుందన్నారు. నేత్ర బ్యాంక్ ప్రజల కార్నియ మార్పిడి చికిత్స అవసరాలను తీరుస్తుందని వివరించారు.

నగర పాలక సంస్థలో అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడపకార్పొరేషన్‌లో జరుగుతున్న చెత్త పన్ను వసూలు, కుక్కల ఆపరేషన్, ఫుట్ పాత్ వసూళ్ల, అడిషనల్ కార్మికుల సంఖ్య, వేతనాలపై నిజాయితీ గల అధికారి చేత సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలుతీసుకోవాలని సీపీఎం కడపనగరకార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరపాలక సంస్థఆఫీస్ ఎదుటసీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, నగర కమిటటీ సభ్యుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే ప్రభుత్వ ధ్యేయం


నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ ఆయకట్టు పరిధిలో సాగయ్యే ప్రతి ఎకరాకు పూర్తిస్థాయిలో నీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చెన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు గోదిన శ్రీనివాసులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. చెన్నూరులోని కాల్వలకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈ మారు మరింత ముందుగానే కేసీ ఆయ కట్టుకు నీరు రావడం జరిగిందని, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రన్నారు. రైతు బాగుపడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనరు కె.విజయభాస్కరరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, ఉప్పరపల్లె నీటిసంఘ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, టీసీ నేత మురళి, జిల్లా రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, షబ్బీర్‌హుసేన్, మల్లికార్జునరెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, రామ్మూర్తిరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

డీఆర్వోకు వినతి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే పురస్కరించుకొని సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వర్కింగ్ జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రంలో ప్రస్తావించారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు,పింఛన్ చెల్లింపు,అక్రిడిటేషన్లు జారీకి వీలుగా కొత్త జీఓ తీసుకురావడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల అవార్డులను ప్రధానం, రాష్ట్రకేంద్రంలో వృద్ధ జర్నలిస్టుల కోసం ఓల్డ్ ఏజ్ హోం నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరంలో వాహనాల తనిఖీలు




కడప క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్‌పార్కు రోడ్డులో సోనోవిజన్ మాల్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ రామక్రిష్ణ, ఎస్ఐ అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. వాహనాల రికార్డులు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ ఇతర రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న జరిమానా, చలానాలను తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.

పెరటి తోటల పెంపకం చేపట్టాలి


మహిళలకు పెరటి విత్తనాలు, మొక్కలు అందిస్తున్న అధికారులు

సీకేదిన్నె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెరటి తోటల పెంపకం చేపట్టడం ద్వారా కూరగాయలు, ఆకుకూరలు మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని పండించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట గ్రామంలో సోమవారం పెరటితోట పెంపకంపై మహిళలకు అవగాహన కలిగించి పెరటి తోట విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో పెరటి తోటలను పెంచుకోవడం ద్వారా ఇంటిలోనే తాజా ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మునగ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణరాజు, సీసీలు, కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, నీలకంఠారెడ్డి, గంగిరెడ్డి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ



సింహాద్రిపురం, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కసనూరు గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠ నిర్వహించారు. గతంలో ఆలయంలో ఉన్న ధ్వజ స్తంభం కూలిపోవడంతో కొత్తది ఏర్పాటు చేశారు. గ్రామంలోని వారం రోజులుగా శ్రీదేవి భూదేవి చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ పఠనం సోమవారంతో ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామ దేవత పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రాణ ప్రతిష్ఠలు నిర్వహించారు. దీంతో కసనూరు గ్రామంలో కొత్త, పాత జనాలతో పండుగ వాతావరణం నెలకొంది. పై కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘రాచమల్లు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం సిగ్గుచేటు’


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పులివెందులలో విలేకరులతో మాట్లాడారు. 1978 నుంచి ఈ నియోజకవర్గంలో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత స్థానిక సంస్థలలో ప్రజాస్వామ్యంగా గెలిచారా అని ప్రశ్నించారు. మా అభ్యర్థులను నిలబెట్టి పోటీ చేస్తుంటే ఎక్కడికక్కడ అడ్డుకొని ఆర్వో దగ్గరికి రానిచ్చారా అని ప్రశ్నించారు. నామినేషన్ పత్రాలను చించేశారన్నారు. 2005లో పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తే దౌర్జన్యం చేశారన్నారు. అప్పట్లో నాగవర్ధన్‌రెడ్డి ఇంట్లో నేను, సతీష్‌రెడ్డి ఉంటే మాపై రాళ్లదాడులు చేశారన్నారు. ఈ విషయాన్ని సతీష్‌రెడ్డిని అడగాలన్నారు. 2005లో వేల్పుల సింగిల్ విండో ఎలక్షన్లు జరిగితే దాడులు చేసి చంపాలని చూశారు, హత్యాయత్నం చేశారు ఈ విషయాన్నీ సతీష్‌రెడ్డిని అడగాలన్నారు. 2009లో లింగాల మండలానికి ప్రచారానికి వెళితే రాళ్లదాడులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని కూడా సతీష్‌రెడ్డిని అడగాలన్నారు. అలాగే ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికలలో మీరు చేసిన దౌర్జన్యాలు ప్రజలు మరచిపోరన్నారు. అలాగే కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులంతా కూర్చొని దౌర్జన్యం చేసి గెలిచారన్నారు. అలాగే పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో సాంప్రదాయాన్ని పాటించలేదని రాచమల్లు అనడం దారుణమన్నారు. మీ పార్టీ విధానాలు, నిర్ణయాలు నచ్చక పార్టీ మారితే డబ్బులకు అమ్ముడుబోయారని రాచమల్లు అనడం హాస్యాస్పదమన్నారు. 2009లో వరదరాజులరెడ్డికి టికెట్ ఇస్తే టీడీపీ అభ్యర్థి అయిన లింగారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారన్నారు. ఆరోజు ఎంతకు అమ్ముడుబోయారని ప్రశ్నించారు. ఆరోజు నువ్వు అమ్ముడుపోయింటే ఈ రోజు పార్టీ మారేవారుకూడా అమ్ముడుపోయినట్లేనన్నారు. ఓటమికి భయపడి అధికారం, పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని కుంటిసాకులు చెబుతున్నారన్నారు.

వాన కురవక.. వరికి తెగుళ్లు



చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బోర్ల కింద సాగు చేసిన వరి తెగుళ్ల బారిన పడింది. మండలంలో ఈ ఏడాది జూన్‌లోనే వరినాట్లు వేసిన రైతులు వర్షాలు సరిగా కురవకపోడంతో వరిని నల్లి పురుగు ఆశించి ఎండిపోవడంతో పాటు పలుచోట్ల నాటిన నాట్లు కూడా సరిగా బతకలేని పరిస్థితి వచ్చింది. రోజూ ఆకాశంలో మబ్బులు కనిపిస్తున్నాయి కానీ కురిసేది మాత్రం కలగా మారింది. ఎన్ని బోర్లుండి నీరు పారినా ప్రకృతి కరుణించి సకాలంలో వర్షం పడితే ఖరీఫ్‌లో నాటిన వరి కాసింత ఆరోగ్యంగా ఉంటుందని రైతులు ఆశించారు. వర్షాలు కురవక పోవడంతో వరి సాగు చేసి రైతులు దిగాలు చెందుతున్నారు. ఇలాగైతే వరికి అదనపు ఖర్చు పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

లింగాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుణకనపల్లె గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. గుణకనపల్లె గ్రామానికి చెందిన రాయుడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో బెల్ట్‌షాపుపై దాడి చేసి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్లు నిలిపితే చర్యలు

కడప క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్లు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు కడప ట్రాఫిక్ సీఐ జావీదు తన సిబ్బందితో ఎన్టీఆర్ సర్కిల్‌ను పరిశీలించారు. సర్కిల్ ఆనుకుని కార్లు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎవరైనా అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో మాత్రమే వాహనాల పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన స్థానికులతో కలిసి నో పార్కింగ్ బోర్డుతో పాటు వాహనాలను నిలపకుండా బార్కెట్ వేశారు. కార్యక్రమంలో స్థానికులు జహీద్, జమాల్, అన్వర్, ఆరిఫ్, మసూద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

చెన్నూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చెన్నూరు లక్ష్మీనగర్‌కు చెందిన జప్పీ వెంకటసుబ్బయ్య సోమవారం రాత్రి స్థానిక కొత్తరోడ్డు దాటుతుండగా కారు ఢీకుని తీవ్రగాయాలపాలయ్యాడు.స్థానికులు గాయపడ్డ వెంకటసుబ్బయ్యను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం 5వ తేదీ ఉదయం 11గంటకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. అర్హత ప్రమాణాలు ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా ఎంబీఏ శాఖలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

14 వరకు పంటల నమోదుకు గడువు

మైదుకూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటల నమోదుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు ఉందని మండల వ్యవసాశాఖ అధికారి బాలగంగా ధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు, ఉల్లి, కంది, మినుము, జొన్న తదితర పంటలకు బీమా చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో రైతులు పంటల నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మైలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 20వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈనెల 6వ తేదీ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 1 2024 నుండి మార్చి 31.2025 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రజావేదిక జరగనుందని, కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

రేపు విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఖాజీపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే 9, 10 తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గిరిజా సంపతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 6వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో 8.45 గంటలకు క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఒక్కో పాఠశాల నుంచి 9, 10 తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు అందించనున్నట్లు ఆమె తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కాశినాయన, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లె గ్రామంలో సోమవారం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో వీరంతా పేకాట ఆడుతుండగా పట్టుకొని వారి నుండి 3050 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు రామాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం సాయంత్రం వ్యక్తికి గాయాలయ్యాయి. చౌటిపల్లె గ్రామానికి చెందిన జయరామిరెడ్డి తన టీవీఎస్ మోపెడ్‌లో ఇంటికి వెళుతుండగా, క్రాసింగ్ వద్ద కారు వేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొంది. దీంతో జయరామిరెడ్డికి గాయలయ్యాయి. గమనించిన స్థానికులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు భైరవ ప్రసాద్, సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్ తెలిపారు. స్మార్ట్‌మీటర్లను వద్దని కోరుతూ జరిగే ఈ ధర్నాకు అందరూ హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు పరికరాల పంపిణీ

అట్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు కృత్రిమ పరికరాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వెంగమునిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుండి 5 గంటల వరకు ఈ కృత్రిమ పరికరాలను పంపిణీ చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు వారి ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికేట్, రేషన్‌కార్డు, ఫోటోలు, సెల్‌ఫోను తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా దోమల నివారణకు మున్సిపాలిటీలో ఫాగింగ్ చేయడం లేదని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఆరోపించటంతో కమిషనర్ రవిచంద్రారెడ్డి ప్రతి వార్డులో ఫాగింగ్ చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం నాలుగవ డివిజన్‌లోని 33వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

యాప్‌ల భారం తగ్గించాలి

- సెల్‌ఫోన్లు వెనక్కు ఇచ్చిన అంగన్వాడీ వర్కర్లు
- వేతనాలు పెంచాలని డిమాండు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పనిచేయని సెల్‌ఫోన్లు ఇచ్చి అంగన్వాడీ వర్కర్లపై సకాలంలో పనులు చేయాలని ఒత్తిడి చేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు తమ సెల్‌ఫోన్లను వెనక్కు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కర్లకు సెల్‌ఫోన్ల స్థానంలో ట్యాబ్‌లు ఇచ్చి యాప్‌లు సరిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, అధ్యక్షురాలు గీత, నాగలక్ష్మి, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీలపై భారం తగ్గించాలి

బద్వేలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాప్‌లు సపోర్టు చేయని సెల్‌ఫోన్లు అంగన్వాడీలకు అందించి ఇబ్బందులకు గురిచేయడం తగదని, యాప్‌ల భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఏపీ అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సీడీపీవో శ్రీదేవికి సెల్‌ఫోన్లను అందించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, కో కన్వీనర్ కొండయ్య, యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, జయప్రద, లక్ష్మినరసమ్మ పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని నిరసన

జమ్మలమడుగు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని అంగన్వాడీలు డిమాండు చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సెల్‌ఫోన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులకు ఫోటోక్యాప్చర్, ఓటీపీ, ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనలు రద్దు చేయాలని, అన్నీ యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ వర్కు చేయలేమని, హాజరు, లబ్ధిదారుల ఆహార పంపిణీ అన్నీ రికార్డు రాస్తామని తెలిపారు.

పనిచేయని సెల్‌ఫోన్‌లు మాకెందుకు ?

ముద్దనూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పనిచేయని సెల్‌ఫోన్‌లు మాకెందుకు అని అంగన్వాడీ కార్యకర్తలు వాపోయారు. అంగన్వాడీ కార్యకలాపాలు నిర్వహించేందుకు అందించిన సెల్‌ఫోన్‌లు సరిగా పనిచేయలేదని ముద్దనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలాల అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం సెల్‌ఫోన్‌లను సీడీపీవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ యాప్‌లు సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, యాప్‌ల నుంచి అంగన్వాడీలకు విముక్తి కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రాజెక్టు అధ్యక్షురాలు లక్ష్మీదేవి, జ్యోతి, ప్రమీల, వరలక్ష్మి, శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.



జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సెల్‌ఫోన్లతో అంగన్వాడీల నిరసన



ప్రొద్దుటూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట..



ముద్దనూరులో సెల్‌ఫోన్లను కవర్లలో తెచ్చిన అంగన్వాడీలు



బద్వేలులో సెల్‌ఫోన్లతో అంగన్వాడీల నిరసన

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వం ధ్యేయం

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



లావనూరు చెరువుకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని లావనూరు చెరువుకు సోమవారం పైడిపాలెం రిజర్వాయిర్ వద్ద గేటు ఎత్తి ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. పైడిపాలెం రిజర్వాయిర్ నుంచి లావనూరు చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రూ.30లక్షల వ్యయంతో అదనంగా గేటును నిర్మించారు. కార్యక్రమంలో కూటమి మండల ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ లావనూరు నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం గణపతి, సీతారామ, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండులాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కూటమి మండల ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, దేవగుడి రాజేష్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ లావనూరు నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆటో, రేషన్ బియ్యం పట్టివేత

ఖాజీపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని టోల్‌ప్లాజా వద్ద 11 బస్తాల రేషన్ బియ్యం, ఆటోను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేయడంతో పాటు రేషన్ బియ్యం ఎవరివి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

ప్రొద్దుటూరు టౌన్/ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలను పురష్కరించుకుని శాస్త్రినగర్ అంగన్వాడీ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, మేధాశక్తి, జ్ఞాపకశక్తి వస్తుందని, న్యుమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడతాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వడం వలన తల్లులకు రొమ్ము క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు రాకుండా నివారించవచ్చునన్నారు. అలాగే దేవాంగపేట సెక్టార్‌లోని హనుమాన్‌నగర్, జగ్గంపేట అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం ఉమారాణి, ఎంఎస్‌కే నాగేశ్వరి, ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరం

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలే శ్రేయస్కరమని అధికారులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓబన్నపేట-2 అంగన్వాడీకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సరోజ, శ్రావణి, రాణి, రామతులసి, జ్యోతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం ఓబన్నపేటలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీలు

ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు కచ్చితంగా ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ప్రత్యూష తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1 నుండి 7వ తేదీవరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని నరసన్నపల్లె అంగన్వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు, బాలింతలకు వివరించారు.

ప్రొద్దుటూరు సివిల్ సప్లై డీటీగా శివప్రసాద్

ప్రొద్దుటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారుగా శివప్రసాద్ నియామకం అయ్యారు. సోమవారం ఆయన ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. శివప్రసాద్ జమ్మలమడుగు నుండి ఇక్కడికి బదిలీ కాగా ఇక్కడ వున్న మల్లికార్జున జమ్మలమడుగుకు బదిలీపై వెళ్లారు.

మున్సిపల్ ఆర్‌వోగా డేనియల్ జోసఫ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా డేనియల్ జోసఫ్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఈనెల 2న ఆర్‌వోసీ నెంబరు 14024/2025/డీ2 ఉత్తర్వులను మున్సిపల్ డైరెక్టర్ సంపత్‌కుమార్ జారీ చేశారు. డేనియల్ జోసఫ్ ఏపీఎంఎంఎస్ఎస్ నుండి ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

చెన్నంపల్లె పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



బద్వేలుటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పాఠశాల రోడ్డు విస్తరణలో భాగంగా పూర్తిగా తొలగించారు. ఈ క్రమంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న పాఠశాలను సోమవారం డీఈవో షంషుద్దీన్, సమగ్ర శిక్షాప్రాజెక్టు ఆఫీసర్ నిత్యానందరాజు సందర్శించారు. త్వరలో నూతన పాఠశాల నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పాఠశాలను తొలగించిన నేపథ్యంలో నష్టపరిహారం కింద రూ.24 లక్షలు బద్వేలు మండల పరిషత్తు అకౌంట్‌కు జమ చేశారని, త్వరలోనే మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతామన్నారు.

9న యజ్ఞోపవీత ధారణ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన శ్రావణ పౌర్ణమి శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం యజ్ఞోపవీత ధారణ, సాయంత్రం లలితాదేవి అమ్మవారికి 108 మహిళలతో జాజిపూలతో సహస్ర నామార్చన, సహస్రనామ కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పార్టీ కోసం పని చేసిన వారికి పదవుల్లో అన్యాయం

- మంత్రి సవితను కలిసిన టీడీపీ నాయకులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు అధికారంలోకి వచ్చాక పదవుల్లో అన్యాయం జరుగుతోందని టీడీపీ మండల కన్వీనర్ బాబు ల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అవుల దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. సోమ వారం పులివెందులలో జిల్లా మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎప్పటికైనా పార్టీ న్యాయం చేయక పోదా అనే ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. ఈ విషయంలో మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



మంత్రి సవితకు విన్నవిస్తున్న బాబుల్‌రెడ్డి

మహిళలకు వేధింపులు

- చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి

జమ్మలమడుగు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ పోస్టాఫీసు వీధితో పాటు సమీప వీధుల్లోని మహిళలను కొందరు పోకిరీలు వేధింపులకు గురిచేస్తున్నారని పలువురు మహిళలు వాపోతున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల సమయంలో, మధ్యాహ్నం, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య మెయిన్ పోస్టాఫీసు వద్ద నుంచి కోట వీధి, బుర్జు వీధి, సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల దగ్గరలో పలుచోట్ల వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా పనిమీద మహిళలు బయటకు వెళ్లాలన్నా, దగ్గరలో ఉన్న దుకాణాల్లో పనిచేయుటకు వెళుతున్నవారిని, ఇతరత్రా పనుల కోసం వెళుతున్నవారిని, ద్విచక్ర వాహనంలో వెంట వెళ్లడం, అనవసరంగా దుర్భాషలాడడం జరుగుతోందని ఆరోపించారు. ఒకరిద్దరు తిరగబడటంతో సెల్‌ఫోన్లతో వీడియోలు, ఫోటోలు తీస్తూ వేధిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు గంగమ్మ దేవాలయం వెనుక భాగంలో బెల్లాల వీధి నుంచి వెళ్లే ప్రాంతంలో, కోట వీధి తదితరచోట్ల పోలీసులు గస్తీ పెట్టి విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరం

కాశినాయన, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం కృత్రిమ పరికరాల తయారీ సంస్థ (అలైమ్‌కో) ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మైథిలీరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో వైద్యులు పరీక్షించి అవసరమైన సహాయ జీవన పరికరాల కోసం సిఫారసు చేస్తారన్నారు. పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు చొరవ తీసుకొని అర్హులైన వారిని ఈ శిబిరాలకు హాజరయ్యేలా చూడాలని ఆమె కోరారు. మండలంలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ ఆక్రమణలు వెలికితీయాలి

బద్వేలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలో ఓ పార్టీకి చెందిన నాయకుడి భూఆక్రమణలను వెలికితీయాలని వైసీపీ జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రంగసముద్రం చెరువు ఆయకట్టుచైర్మన్ చెరుకూరు శ్రీధర్‌నాయుడు భారీ స్థాయిలో భూ ఆక్రమణలకు పాల్పడ్డాడని, ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని చర్యలు చేపట్టాలని కోరారు. త్వరలో మరో 500 ఎకరాల భూ ఆక్రమణలపై ఆధారాలతో సహా బయటపెడతానని ఆయన తెలిపారు.

బంగారు కుటుంబాలను ఎంపిక చేయాలి

చాపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పేదలను బంగారు కుటుంబాలుగా త్వరగా ఎంపిక చేయాలని ఎంపీడీవో వీరకిశోర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బంగారు కుటుంబాల ఎంపికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పీ-4 సర్వేను వేగవంతం చేయాలన్నారు. గతంలో నిర్వహించిన 2853 కుటుంబాలపై మళ్లీ సర్వే నిర్వహించి బంగారు కుటుంబాలకు అర్హత కలిగిన వారిని గుర్తించాలన్నారు. పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులకు సలహాలు, సూచనలు, మెటీరియల్ ఇచ్చేందుకు, పేద కుటుంబాలను పారిశ్రామికవేత్తలు, అధికారులు, ఇతరులు దత్తత తీసుకోవచ్చన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజయోగ సాధనతో మానసిక ప్రశాంతత

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజయోగ సాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బెంగుళూరుకు చెందిన ఆంధ్రా, కర్ణాటక ఓంశాంతిల సబ్‌జోన్ డైరెక్టర్ బ్రహ్మకుమారి లీలాదీదీ తెలిపారు. సోమవారం విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్‌లో ఆత్మీయ స్నేహ మిలీనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 80 సంవత్సరాల క్రితం ఉమ్మడి కుటుంబంలో ఉన్న ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ప్రస్తుతం లేవని, గృహస్థ ధర్మానికి చెందిన రాజయోగం మానవ హితానికి, మనోల్లాసానికి, జీవన సమతుల్యతకు చక్కటి పరిష్కారమన్నారు. కుటుంబ విలువలు, సుఖసంతోషాలతో మిళితమైన రాజయోగ సాధన వల్ల ప్రతి ఒక్కరు సుఖంగా జీవించవచ్చునన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు శాంత, సుశీల, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

బద్వేలు/బద్వేలు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చట్ట వ్యతిరేకమని ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మల్లేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, వైద్యులకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని, అలాగే ప్రోత్సహించిన వారికి కూడా జరిమానా, జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య మాట్లాడుతూ మగవారితో సమానంగా ఆడపిల్లలను చూడాలని, ఆడ పిల్లల నిష్పత్తిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ

బద్వేలు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోటవీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, ఆ పరిధిలోని వల్లెరవారిపల్లె వార్డు సచివాలయాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసరు రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కౌమార దశ బాలికలకు రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. రికార్డుల ఆధారంగా గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల రక్తహీనత గల వారి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి డేటాను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంవో నారాయణ, హెచ్‌ఎంఎస్ డేటా పర్యవేక్షకులు రాజశేఖర్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసరు శాంతికళ, డిప్యూటీ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి మల్లేశ్, డాక్టర్లు వినయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, సౌమ్య పాల్గొన్నారు.

విద్యాశాఖ జీవోను రద్దు చేయాలి

- ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థలలో ఇతరులకు ప్రవేశం లేదన్న జీవోను రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగురాష్ట్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జయరాం పేర్కొన్నారు. సోమవారం విద్యార్థి, ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థి సంఘాల నాయకులు ఆ పాఠశాలలోకి వెళ్లినప్పుడే సమస్యలు వెలుగులోకి వస్తాయన్నారు. విద్యార్థుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఇతరులు విద్యాసంస్థలలోకి ప్రవేశం లేదని జీవో జారీ చేయడం వలన ఆ విద్యాసంస్థలలో ఉన్న సమస్యలు బయటకు రావన్నారు. విద్యాసంస్థలలో ఉన్న లోపాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రభుత్వం ఇటువంటి జీవో జారీ చేసిందని విమర్శించారు.